## క్లుప్తంగా

### రూ. 50 వేలకు మించి తరలించొద్దు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వాహనాల్లో ఆధారాలు లేకుండా రూ. 50 వేలకు మించి నగదును తరలిస్తే ఆ నగదును సీజ్ చేస్తామని ఎస్సై మహేశ్ అన్నారు. సోమవారం మండలంలోని బొగ్గగుడిసె శివారులో వాహనాలను తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వాహనాలను తనిఖీ చేశారు.

### బాయంపల్లిలో తాగునీటి ఎద్దడి

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని బాయంపల్లిలో తాగునీటి ఎద్దడి ఏర్పడి గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని పంచాయతీ బోరుబావుల్లో నీరు అడుగంటిపోయినట్లు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, జీపీ ప్రత్యేకాధికారులకు సమస్య వివరించినా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా గ్రామానికి వచ్చి చూడడంలేదన్నారు.

### కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్‌లు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్, మాసాన్‌పల్లి, జలాల్‌పూర్ మాజీసర్పంచ్‌లు బాల్‌రెడ్డి, విఠల్, బాల్‌రాంరెడ్డితోపాటు మాటూర్ మాజీ ఉపసర్పంచ్ కృష్ణ, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

### ఉద్యమ ఫలితమే ప్రత్యేక కార్పొరేషన్లు



కామారెడ్డి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం బీసీ ఉద్యమాల ఫలితమేనని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, సలహాదారు షబ్బీర్‌అలీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మహిళా వర్కింగ్ అధ్యక్షురాలు లత, ప్రతినిధులు మర్కంటి భూమన్న, మోహనాచారి, అబ్దుల్ అజీజ్, ఎస్ నారాయణరావు, గోపాల్, రమేష్, మల్లయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### తైబజార్ వేలం



బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని జీపీ ఆవరణలో సోమవారం తైబజార్ వేలం పాట నిర్వహించారు. రూ.15.50 లక్షలకు వేలం పాటను బాబుమియా దక్కించుకున్నారు. గ్రామ పంచాయతీ గతం కంటే ఎక్కువగా వేలం పాట ద్వారా ఆదాయం వచ్చిందని కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహబూబ్, జీపీ సిబ్బంది హన్మంత్ రావు, కిష్టారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### టెన్త్ విద్యార్థులకు ఆటోల ఏర్పాటు



దోమకొండ : మండలంలోని అంబర్‌పేట గ్రామానికి చెందిన పదో తరగతి పరీక్షలు రాసే సుమారు 47మంది విద్యార్థులకు గ్రామస్తుడు ఆరుట్ల అనిల్ తన సొంత ఖర్చులతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేయిస్తున్నాడు. అంబర్‌పేట్ నుంచి బీబీపేట పరీక్ష కేంద్రానికి ఆటోలు ఏర్పాటు చేసి తన ఉదారతను చాటుకున్నాడు. సోమవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రులతో కలిసి పాఠశాల ఆవరణలోని సరస్వతి విగ్రహానికి పూలమాలల వేసి ఉచితసేవను ప్రారంభించారు.



గాంధారి జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

# పది పరీక్షలు ప్రారంభం



సదాశివనగర్‌లో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆయా పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సమయానికి ముందుగానే చేరుకున్నారు. ఆయా కేంద్రాల్లో సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే విద్యార్థులను సెంటర్లలోకి అనుమతించారు. స్పెషల్ స్క్వాడ్ పలు పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేశాయి. సెంటర్ల వద్ద పోలీసులు భద్రత కల్పించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. – సాక్షి నెట్‌వర్క్



దేవునిపల్లి జెడ్పీహెచ్ఎస్ వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



మద్నూర్ పరీక్ష కేంద్రం వద్ద..



ఎల్లారెడ్డిలోని జెడ్పీ బాలికల పాఠశాలలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఉపాధ్యాయులు



గోపాల్‌పేటలో..



నిజాంసాగర్‌లో..



మద్నూర్‌లో..



తాడ్వాయిలో..



లింగంపేటలో..



రాజంపేటలో..

## జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డైరెక్టర్లు, రైతులు తీర్మానం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మహాజన సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో సందీప్ వ్యవసాయ సహకార సంఘం లావాదేవీలను చదివి వినిపించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ హన్మంత్ రెడ్డి, డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఈవో సందీప్

## ఉపాధి పనులను పకడ్బందీగా చేపట్టాలి

దోమకొండ : గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టే పనులను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్ట్ అదనపు డైరెక్టర్ వామన్ రావు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సామజిక 14వ తనిఖీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు పని ప్రదేశాల్లో కావాల్సిన వసతులు ఏర్పాటు చేయాలని అన్నారు. పనుల్లో అవకతవకలు లేకుండా చూసేందుకు సామాజిక తనిఖీ ఏడాదికోసారి చేపట్టడం జరుగుతుందన్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, ఏపీవో దత్తాద్రి, ప్రశాంత్, ఎంపీడీవో రమేశ్, పూర్వపు ఎంపీడీవో చిన్నారెడ్డి తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

## సౌత్‌క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం

భిక్కనూరు : తెలంగాణ యునివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ యునిట్ -6 ఆధ్వర్యంలో సోమవారం శ్రమదానం చేశారు. రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షం వడగండ్ల వానల వల్ల క్యాంపస్ ఆవరణలోని కొన్ని చెట్లు నేలకూలడంతో పాటు మొత్తం చెత్త చెదారంతో నిండిపోయింది. దీంతో విద్యార్థులు ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో శ్రమదానం చేసి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారి డాక్టర్ హరిత, అధ్యాపకులు మోహన్‌బాబు, వైశాలి, శ్రీమాతలతో పాటు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న వలంటీర్లు

## కుర్మ సంఘం నూతన కార్యవర్గం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి కుర్మ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిందం మల్లేష్, ఉపాధ్యక్షులుగా దొడ్లె చిన్నసాయిలు, నాగల్ల బీరయ్య, క్యాషియర్‌గా ఒగ్గు నర్సింలు, రైటర్‌గా బుల్లె శ్రీశైలం, కార్యవర్గ సభ్యులుగా మచ్చ గంగాధర్, బండారి మహేశ్, భాస్కర్, దుమాల మల్లేష్, గౌరవ ఉపాధ్యక్షునిగా గండాల రవి ఎన్నికయ్యారు.

## మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా భరత్ కుమార్



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల మత్స్య పారిశ్రామిక సంఘం నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడిగా భరత్ కుమార్ ఎన్నికైనట్లు జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ కోఆపరేటివ్ అధికారి సీహెచ్ రోజ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో కమిటీని నియమించారు. ఉపాధ్యక్షుడిగా ముత్యం రాములు, డైరెక్టర్లుగా పెద్ద మోహన్, వంగల మోహన్ తదితరులున్నారు.

# పంట నష్టపరిహారం చెల్లించాలి



పద్మాజీవాడిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్ రావు



రాజంపేటలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : ఇటీవల కురిసిన అకాల వర్షానికి తెబ్బతిన్న మొక్కజొన్న పంటను సోమవారం మాజీ జెడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులచే తనిఖీలు చేపట్టి పరిహారాన్ని చెల్లించాలన్నారు.

రాజంపేట : శనివారం కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను సోమవారం కామారెడ్డి సహాయ వ్యవసాయ సంచాలకులు అపర్ణ ఆధ్వర్యంలో పరిశీలించారు. రాజంపేట, తలమడ్ల, శివాయిపల్లి గ్రామాల్లో ఎక్కువగా వరి, మొక్కజొన్న, కూరగాయల సాగు పంటలు అధిక మొత్తంలో నష్టపోయినట్లు గుర్తించినట్లు ఆమె తెలిపారు. ఏఈవో సహకారంతో పంటనష్టం వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తామన్నారు. ఆమె వెంట ఏఈవోలు శ్రీకాంత్, మనుష్య ఉన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని ఎండ్రియాల్, ఎర్రపహాడ్ గ్రామాల శివారులోని నేలకొరిగిన పంటలను సోమవారం జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారం రాత్రి గాలి దుమారంతో కూడిన వర్షం పడడంతో మొక్కజొన్న, వరి కూరగాయల పంటలు నేలకొరగగా వివరాలను ప్రభుత్వానికి పంపుతామన్నారు. మండలంలోని కృష్ణాజీవాడి, బ్రహ్మజీ వాడి తాడ్వాయి ఎండ్రియాల్ ఎర్రపహాడ్, దేమి కలాన్, కన్కల్ తదితర గ్రామాల్లో అధికంగా మొక్కజొన్న పంట, వరి పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఆమె వెంట ఏడీఏ రత్న, ఏవో శ్రీకాంత్, ఏఈవో రైతులు ఉన్నారు.

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని తెల్గాపూర్ గ్రామ శివారులోని అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను సోమవారం క్లస్టర్ ఏఈవో గ్రీష్మ పరిశీలించారు. పంటనష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఏఈవో గ్రీష్మ తెలిపారు.

భిక్కనూరు : మండలంలోని అంతంపల్లి, రామేశ్వర్‌పల్లి గ్రామాల్లో అకాల వర్షం, వడగండ్ల వాన వల్ల నష్టపోయిన పంటలను ఏడీఏ అపర్ణ పరిశీలించారు. వరి, మక్క, కూరగాయల పంటలను ఆమె పరిశీలించి నివేదికను రూపొందిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఏవో రాధ,ఏఈవోలు రజిత, అఖిలేష్, వినోద్‌గౌడ్‌లు పాల్గొన్నారు.



తెల్గాపూర్ శివారులో నేలవాలిన జొన్నపంటను పరిశీలిస్తున్న ఏఈవో గ్రీష్మ



అంతంపల్లిలో పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ అపర్ణ

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

బిచ్కుంద(జుక్కల్) :అకాల వర్షంతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బిచ్కుంద సొసైటీ చైర్మన్ నాల్చర్ బాలు శ్రీహరి అన్నారు. సోమవారం సంఘం మహాజన సభ ఏర్పాటు చేర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఖత్గాం, శెట్లూర్, హజ్గుల్, పుల్కల్, సిర్‌సముందర్ ఆయా గ్రామాలలో వరి, పొగాకు, కుసుమ పంటలకు తీవ్ర నష్టం జరిగింది ప్రభుత్వం ఎకరాకు రూ.35 వేలు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులకు ఎన్ని రుణాలైన సంఘం ఇస్తుందన్నారు. రుణాలు, రైతులకు పరిహారం, కోటి రూపాయల విత్తనాలు, ఎరువులు, ఇతర పరికరాలు సొసైటీలో అందుబాటులో ఉంచాలని తీర్మానం చేశారు. డైరెక్టర్లు, రైతులు, కార్యదర్శి శ్రావణ్ పాల్గొన్నారు.

## బీజేపీలో పలువురి చేరిక



కామారెడ్డి టౌన్ : పట్టణంలోని దేవునిపల్లికి చెందిన 31 మంది యువకులు సోమవారం బీజేపీ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి సమక్షంలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

## సమాచారం..

**నేడు మండల సర్వసభ్య సమావేశం**

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు నివేదికలతో విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**నేడు రైతు నేస్తం కార్యక్రమం**

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నేడు మండల కేంద్రంలో గల రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి నరేంద్ర తెలిపారు. దీనిలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉదయం 10గంటల నుండి 11.30 గంటల వరకు వరిలో ప్రస్తుతం పాటించాల్సిన మెళకువలను వివరిస్తారన్నారు.

**నేడు గీతా మందిర 22వ వార్షికోత్సవం**

కామారెడ్డి అర్బన్ : స్థానిక సిరిసిల్లరోడ్డులోని శ్రీకృష్ణ గీత మందిరం 22వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 19న మంగళవారం ఉదయం 10గంటలకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గీత తత్త్వార్థ జ్ఞాన సత్సంగం కార్యదర్శి అర్వపల్లి రమేశ్ తెలిపారు. మధ్యాహ్నం మహాప్రసాదం, సాయంత్రం వేదగాన ప్రవచనాలుంటాయన్నారు.

## గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం



కామారెడ్డి టౌన్ : తెలంగాణ రాష్ట్ర గిరిజన డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్‌ను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఘనంగా సన్మానించారు. అలాగే రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోదెం వీరయ్యను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ రాణా ప్రతాప్ రాథోడ్ , నాయకులు భూక్యా రాజు, మోహన్, తిరుపతి, రాకేష్, గణేశ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

**టీఎండీసీ కార్పొరేషన్ చైర్మన్‌కు..**



కామారెడ్డి టౌన్ : తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీఎండీసీ) చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌ను సోమవారం కామారెడ్డి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్, చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బని కృష్ణహరి తదితరులున్నారు.

## సంక్షిప్తం

**ముగిసిన మల్లన్న ఉత్సవాలు**



దోమకొండ : మండల కేంద్రంలోని మల్లన్న స్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఉత్సవాల చివరి రోజు మల్లన్నస్వామి గొల్ల కేతమ్మ మేడలమ్మ కల్యాణం ఘనంగా నిర్వహించారు. రేణుకా ఎల్లమ్మ మునిరాజుల కల్యాణం కూడా జరిపారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు నేతుల నాగరాజు, కట్ట లక్ష్మణ్, సిరిబోయిన ప్రవీన్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, మాజీ సర్పంచ్ నల్లపు శ్రీను తదితరులున్నారు.

**2వ వార్డులో చేతి పంపు ఏర్పాటు**

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మున్సిపాలిటి పరిధిలోని 2వ వార్డులో చేతి పంపును ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు సోమవారం తెలిపారు. 2వ వార్డు పరిధిలోని బీసీ కాలనీలో నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు చేతి పంపును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు విద్యాసాగర్, సాయిలు తదితరులున్నారు.

**బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం**

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని మోతె, సజ్జన్‌పల్లి గ్రామాలకు చెందిన అగ్ని ప్రమాద బాధితులకు బీజేపీ నాయకుడు ఒడ్డెపల్లి సుభాష్‌రెడ్డి అండగా నిలిచారు. సోమవారం ఆయా గ్రామాల్లో అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించారు. మోతె గ్రామానికి చెందిన అవుల కుమార్, సజ్జన్‌పల్లి గ్రామానికి చెందిన నీల పోచయ్య నివాసం గుడిసెలు దగ్ధం కాగా బాధితులకు ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

**పరామర్శ..**



గాంధారి(ఎల్లారెడ్డి) : మండలంలోని ముదెల్లి, గౌరారం గ్రామాల్లో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల చెరువులో పడి మృతి చెందిన చిన్నారులు రవి, శశాంక్ కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటామని చిన్నారుల తల్లిదండ్రులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులున్నారు.

**ఆర్థికసాయం..**

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రానికి చెందిన గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ సిబ్బంది శ్రీనివాస్ గుండెపోటుతో ఆకస్మిక మరణం చెందడంతో గ్రామ పంచాయతీ తరపున రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్ ఉన్నారు.